# పిచ్చితల్లి

అగస్త్యప్రగడ హేమంత

**గబగబా ముందుకి నడుస్తున్నదల్లా దారికి అడ్డుగా కనబడిన దడిని చూసి ఠక్కున ఆగిపోయింది కుసుమ. ఇక్కడ ఇదెలా వచ్చిందీ?" తనలో తనే అనుకుంది. ఒక్క క్షణం స్థిమితంగా ఆలోచిస్తే అప్పుదర్థమైంది. కౌలు వాళ్ళెవరో దాన్నలా కట్టి ఉంటారని.**

బొత్తిగా బుద్ధి లేకుండా పోతోంది వీళ్ళకి. ఈ దళ్ళూ తుప్పలూ ఎక్కడపడితే అక్కడ కట్టేసి పదెకరాల పొలాన్ని పాతిక ముక్కలు చేసేశారు" విసుగ్గా అనుకుంది.

ఎందుకో, దాన్నలా చూస్తుంటే ఆమెకి పిచ్చికోపం వచ్చేసింది. అడ్డుగా ఉన్న ఆ దడిని పీకి పారేయాలనిపించింది. ఆలోచన వచ్చిందే ఆలస్యం, ఆవేశంగా నాలుగడుగులు వేసి అడ్డుగా వున్న కఱ్ఱని పట్టుకుని బలంగా లాగబోయింది.

ఇంతలో "ఎందుకమ్మా దాని లాగుతున్నారు?" అంటూ వినిపించిందో స్వరం.

చివాల్న తల తిప్పి ప్రశ్న వినిపించిన దిశగా చూసింది. ఎవరో అపరిచితుడు. అతని ముఖంలో అయోమయం. అతనెవరో ఆమెకి అర్థం కాలేదు. ఆ మాటే అడిగింది. "ఇంతకీ నువ్వెవరు?" అని.

"ఆ దడి కట్టినోణ్ణి" చెప్పాడతను.

"ఇక్కడెందుక్కట్టారిది?" అసహనంగా ఆరా తీసింది.

"నా పొలానికి హద్దు అదేనమ్మా! సరిహద్దులో దడి కట్టాలి. ఆ పైన ఇందులోకి పశువులు రాకుండా చూసుకోవాలి కదమ్మా! అందుకే కట్టాను" వినయంగా చెప్పాడు.

అతని మాటలకి నెత్తిన పిడుగు పడ్డట్టుగా అదిరి పడింది కుసుమ.

"ఇది.. నీ పొలమా?" అక్షరం అక్షరం కూడబలుక్కుంటూ అడిగింది.

"అవునమ్మా" మరింత వినయంగా చెప్పాడతను.

గుండె భగ్గుమందామెకి. "ఎంత ధైర్యంరా నీకు? జాగ్రత్తగా చూడమని కౌలుకిచ్చిన పొలాన్ని నీ



స్వంతమని చెబుతావా? పైగా సరిహద్దులూ, జాగ్రత్తలూ అంటూ దళ్ళు కడతావా? నీకసలు బుద్ధుందా? ఉండు.. మా నాన్నగారితో చెప్పి వెంటనే నీ కౌలుపత్రం రద్దు చేయిస్తాను. తిరగ రాయించేస్తాను. ఈ పొలాన్ని నీ చేతిలోంచి ఊడలాక్కుని ఇంకో మంచివాడికి అప్పజెప్తాను" ఆవేశంతో ఊగిపోతూ ఆమె అరిచేస్తుంటే వింటున్న అతను నివ్వెరపోయాడు ముందు.

ఆ తర్వాత, ఒక్క క్షణం తనని తాను సంభాళించుకుని తేరిపారి చూశాడు ఆమె వైపు. అప్పుడు 'విషయం' అర్థం అయ్యీ కానట్టుగా అనిపించిందతనికి. అప్రయత్నంగానే ముచ్చెమటలు పట్టేశాయి. "ఇంతకీ తమరు.. ఏ ఊర్నుంచి వచ్చారూ?" అడిగాడు, నుదుట పట్టిన చెమటల్ని భుజానున్న తువ్వాలుతో అద్దుకుంటూ.

ఆ ప్రశ్నతో మరింత పేట్రేగిపోయిందామె. "ఏ ఊర్నుంచి వచ్చానని కాదు.. నేను ఎవరమ్మాయినని అడుగు. అవునూ ఇంతకీ నేనెవరో నీకు తెలుసా?"

"చెప్పండి"

"జగపతిగారమ్మాయిని" అతిశయంగా అంది.

ఆ జవాబుతో అతని సందేహం తీరిపోయింది. అయినా ఎందుకైనా మంచిదని మళ్ళీ అడిగాడు. "మీరు ఆరి పెద్దమ్మాయి కదూ?" అని.


"అవును పెద్దమ్మాయినే. అంతేకాదు, ఈ పదెకరాల పొలం నాదే..తెలుసా?" పొగరుగా అంది.

"అయ్! తెలుసండి. తవరిప్పుడు పొలమంతా కలదిరుగుతారాండీ?" వినయంగా ప్రశ్నించాడు.

"అవున"న్నట్టుగా తలూపింది.

వెంటనే "ఇలా రండి" అంటూ ఓ పక్కకి దారితీశాడతను. అక్కడ దడికి కట్టి ఉన్న తాళ్ళు విప్పి చిన్నపాటి గేటులా ఉన్న తడికని పక్కకి లాగాడు. "ఈ దార్లోంచి ముందుకెల్లండమ్మా! తోటంతా కనపడద్ది" చెప్పాడతను.

"అదీ.. అలా ఉండాలి. కౌలుదారువి కౌలుదారులాగానే ఉండు. అంతే కాని పొలం నీ స్వంతమైనట్లు వెర్రిమొర్రి వేషాలేయకు" అతన్ని గట్టిగా హెచ్చరించి ఠీవిగా అడుగులు ముందుకేసిందామె.



## మథనం

అర్థానికి కామానికి దాసుడై
తపించేవాడు కామరోగి!

పరమార్థానికి దాసుడై
పరితపించేవాడు పరమయోగి!

బాధితుల్లో, పీడితుల్లో
పరమాత్మను దర్శించేవాడు
ఆత్మయోగి!

సమాజాన్ని వర్గాలుగా,
కులాలుగా చీల్చి
ఓట్ల పబ్బం గడుపుకునేవాడు
కుటిల రోగి!

న్యాయాన్ని ప్రసరించనీక
గర్భస్రావం చేసేవారూ,
ధర్మానికి సంకెళ్ళు వేసి
రాజ్యాంగాన్ని చెరచేవారూ
రాజకీయ కీచకులు!

ప్రకృతిలో పరమాత్మను దర్శించలేక
దేవుడు లేడనే వితండ వాదిని!
పాలలో వెన్న కన్పించలేదని
తర్కించే అవివేకిని
ఏమందురు?

పాలను పెరుగుగా విరిచి
మథించి - మథించగా సాధించేది
మృదువైన వెన్న
ప్రకృతిని తనలో భావిస్తూ - ధ్యానిస్తూ
అంతర్ముఖుడైతే కన్పించేది
పరమాత్మ!

ఈర్ష్యా ద్వేషాలతో రగిలేది
హాలాహలం
ప్రేమానురాగాలు వర్షించేది
పరమా(త్మ)మృతం!

— చాడ రమణమూర్తి

"ఎంత ద్రోహం చెయ్యబోయాడు? తనెవరో తెలియక పొలమంతా అతనిదేనని చెప్పుకుందామని చూశాడు. వెంటనే తెలివిగా తను ఎదుర్కొని వాడి నోరు మూయించింది కాబట్టి సరిపోయింది. లేకపోతే? అమ్మో! కౌలుకి తీసుకున్న పొలాన్ని వీళ్ళు స్వాధీనం చేసేసుకుందామన్న ఆలోచనలో ఉన్నారేమో! వెంటనే తండ్రితో మాట్లాడి వీళ్ళందర్నీ మార్పించెయ్యాలి" ఆలోచిస్తూ ముందుకు నడుస్తున్న ఆమె ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి నొసలు ముడేసింది.

అక్కడ కొబ్బరికాయలు దింపేవాళ్ళు నలుగురు కొబ్బరి చెట్లు ఎక్కుతున్నారు. వాళ్ళు ఎక్కుతున్న చెట్లకి కాస్త దూరంలో నిలబడి ఆ తతంగాన్నంతా చూస్తున్నాడో ఆసామీ. అతని వెనక, చెట్లమీంచి రాలబోయే కాయల్ని ఏరడానికి సిద్ధంగా.. ఇద్దరు పనివాళ్ళు!

చూస్తున్న కుసుమకీ విషయం అర్థమైంది. తనకి తెలియకుండా, తనతో కనీసం మాట మాత్రమైనా చెప్పకుండా, పొలాన్ని కౌలుకి తీసుకున్న అతను, అలా కొబ్బరి కాయలు దింపడానికి సిద్ధమయ్యేసరికి ఆమెకి పట్టరానంత కోపం వచ్చేసింది.

"ఏయ్! ఏం చేస్తున్నారిక్కడ?" చేతులు వెనక్కి కట్టుకుని, దింపేవాళ్ళని అజమాయిషీ చేస్తున్న పెద్దమనిషి దగ్గరకి వెళ్ళి.. అధికారికంగా అడిగింది. ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడతను. ఎదురుగా కనిపించిన కుసుమని చూసి అదిరిపడ్డాడు. "మీ.. మీరా!" అన్నాడు అప్రయత్నంగానే.


"ఏమిటీ ఈవిడింత హఠాత్తుగా ఉరుము లేని పిడుగులా ఊడిపడిందే అని ఆశ్చర్యపోతున్నావా?" వ్యంగ్యంగా అడిగింది.

"అబ్బే లేదు.. అదేం లేదు" తడబడ్డాడతను.

దొరికిన దొంగలా తయారయిన అతని మొహం, ఆ మొహంలోని తడబాటు చూస్తుంటే ఆమెకి తమాషాగా అనిపించింది. అతన్ని ఇంకా ఇంకా ఏడిపించాలనిపించింది. కానీ ఎందుకో ఏదో అడ్డొచ్చి ఆగిపోయింది. "ఇంతకీ నీ పేరేమిటి?" అడిగింది.

"కేశవరావు" చెప్పాడు.

"సర్లే ఏదయితే ఏంగానీ రెండు బొండాలు తీయించు. తాగుతాను" ఆజ్ఞాపించింది అక్కడే వున్న ఇసుకలో కూలబడుతూ.



## ప్రియాంక అవకాశాలు సమీరాకి!

'ముసాఫిర్' సినిమాలో మరిచిపోలేని ముద్దిచ్చింది సమీరా' అని అనిల్‌కపూర్ సర్టిఫికేట్ ఇవ్వడం తోనే సమీరాకి ఇబ్బడి ముబ్బడిగా అవకాశాలొచ్చి పడుతున్నాయట. ఇదిలా ఉంటే అజయ్‌దేవగన్‌తో ప్రియాంకా చోప్రా చేయాల్సిన సినిమా అవకాశం సమీరాకి దక్కింది. తీసుకున్న అడ్వాన్స్ ఇవ్వక పోయినా ఫర్వాలేదు, మాకు సమీరారెడ్డే కావాలని పట్టుపడుతున్నాడు ఆ సినిమా నిర్మాత. ఇందులో రెండో హీరోయిన్‌గా భూమిక కూడా నటిస్తోంది.

"రేయ్ నాలుగు బొండాలు తియ్" ఆమె చెప్పడమే ఆలస్యం అన్నట్టుగా చెట్టుమీదున్న దింపే మనిషిని ఉద్దేశించి కేకపెట్టాడు కేశవరావు.

"ఆయ్ అలాగేనండి" చెట్టుమీంచే సమాధానం చెప్పాడు దింపు తీసే మనిషి.

"ఇంతకీ ఎవరండీ ఆరు?" వెంటనే అడిగాడు.


"జగపతిగారి పెద్దమ్మాయి" కేశవరావు చెప్పాడు.

ఆ సమాధానం విన్నతర్వాత అక్కడున్న వాళ్ళెవరికీ నోట మాట రాలేదు.

సరిగ్గా రెండు క్షణాల తర్వాత చెట్ల మీంచి కాయలు రాలడం ప్రారంభించాయి. దింపు వాళ్ళు కోసి కింద పడేసిన కొబ్బరికాయల్ని కూలిపని చేయడానికి వచ్చిన ఇద్దరు కుర్రాళ్ళతోబాటు తనూ ఏరసాగింది కుసుమ.

ఆమెని వారించడానికీ, ఆమె చేత ఆ పని మాన్పించడానికీ కేశవరావు శతవిధాలా ప్రయత్నించాడు. "మీకెందుకొచ్చిన శ్రమ? మీరలా ఓ పక్కగా కూర్చుని ఈ బొండాలు తాగుతూ చూస్తూండండి. మేమంతా పని చేస్తాం" అని నచ్చచెప్పి చూశాడు.

అయినా ఆమె వినిపించుకోలేదు. "నా పని నేను చేసుకుంటున్నాను. ఇందులో తప్పేం ఉంది?" అంటూ ఆ చేతిలో ఆరు, ఈ చేతిలో ఆరు. తడవకి పన్నెండు కాయలు చొప్పున పట్టుకుని తోట మధ్యకి చేరేసింది. గరుగ్గా ఉండే కొబ్బరికాయ ముచ్చికల్ని గట్టిగా పట్టుకోవడంవల్ల పని పూర్తయ్యేసరికి ఆమె చేతులు ఎర్రగా కందిపోయాయి. మంటలు పెడుతున్న అరచేతుల్ని ఉఫ్ ఉఫ్ అంటూ ఆమె ఊదుతుంటుంటే చూస్తున్న కేశవరావుకి మనసు చివుక్కుమనిపించింది. కణం ఆలస్యం చెయ్యకుండా బొండాల్ని కొట్టించి ఆమె చేతికి అందించాడు. నాలుగు బొండాల్ని ఎత్తినది ఎతినట్లే గటాగటా తాగేసిందామె.




"ఇంటికి వెళదామా!" కుసుమ మొహంలోకి చూస్తూ ఆప్యాయంగా అడిగాడు కేశవరావు.

"ఎందుకు?" మొహం చిట్లించి ఎదురు ప్రశ్న వేసింది.

"భోజనం చేసి కాసేపు రెస్ట్ తీసుకుందురుగానీ" చెప్పాడు.

అతని మాటలు వింటూనే చేదు తిన్నట్టుగా మొహం పెట్టింది. "నేనింకా తోటంతా చూడలేదు. చూశాకే వస్తాను" ఖచ్చితంగా చెప్పింది. కానీ అతను వదల్లేదు. "మీరు యజమానులు. మేం కౌలుదార్లం. ఖాళీ కడుపుతో తోటంతా తిరగడం మీకూ మంచిది కాదు, మిమ్మల్ని అలా తిరగనియ్యడం మాకూ పద్ధతి కాదు. మిమ్మల్ని గౌరవించి ఆదరించడం మా బాధ్యత. కాదనకండి" అర్థించాడతను.

కేశవరావు అర్థింపులూ, వేడికోళ్ళూ, కాకాలూ అన్నీ తనని మంచి చేసుకుని తద్వారా కౌలుకి తీసుకున్న పొలం చేజారిపోకుండా ఉండడానికి చేసే ప్రయత్నాలేనని ఆమెకి బాగా తెలుసు. "కౌలువాళ్ళకి ఈ మాత్రం భయం ఉండాలి" మనసులోనే అనుకుంది. పైకి మాత్రం "సరే పదండి" అంది.

"మీరు ఊర్నుంచి వస్తూ పెట్టెగానీ ఏదయినా తెచ్చారా?" ముందుకి దారి తీస్తూ అడిగాడు కేశవరావు.

"ఆ తెచ్చాను. చాలా బరువుగా ఉందని రావుడి హోటల్లో పెట్టేసి వచ్చాను" చెప్పింది.

"సర్లెండి. మనిషిని పంపించి తెప్పిస్తాను" వినయంగా చెప్పాడతను.

అరగంటలో ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు. కేశవరావు వెనక నిలబడిన తనని చూసి, అతని భార్య ముఖ కవళికలు అదోలా మారిపోవడాన్ని గమనించి గుంభనంగా నవ్వుకుంది కుసుమ. "యజమానిని కదా! ఆ మాత్రం

భయం ఉంటుంది" అనుకుంది. ఇంతలో కేశవరావు కూతురొచ్చి కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళందించింది. ఆ వెంటనే అతని భార్య వసారాలో పీట వాల్చి, ఆకు వేసి భోజనం వడ్డించింది. వాళ్ళు చేస్తున్న ప్రతి పనిలోనూ తనపట్ల భయం కనిపిస్తుండేసరికి కుసుమకి గర్వంగా అనిపించింది.

"రండి! వడ్డించేశాను!" వడ్డన పూర్తిచేసి వినయంగా పిలిచింది కేశవరావు భార్య.

ఆమె అలా ఆహ్వానించడమే ఆలస్యం వెళ్ళి ఆకు ముందు కూర్చుంది కుసుమ. విస్తర్లో బీరకాయ కూర, కొబ్బరి పచ్చడి కనిపించాయి. వాటిని చూస్తుంటే ఆమెకి చిరాకు ముంచుకొచ్చింది. "అన్నంలో కలుపుకోవ దానికి ఇవి రెండేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా?" అసహనంగా అడిగింది.

"వంకాయల పచ్చిపులుసు చేశాను" చెప్పింది కేశవరావు భార్య.

ఆమె సమాధానంతో కుసుమకి అరికాలి మంట నెత్తికెక్కింది. "ఛీ ఛీ బీరకాయ కూర నేను తినను. వంకాయ, కొబ్బరి పైత్యం చేస్తాయి. నీకు తెలీదా?" కోపంగా అరిచింది.

కుసుమ అంతలా అరిచినా అక్కడున్నవాళ్ళెవరూ కిక్కురుమనలేదు. అదంతా తన పదెకరాల కొబ్బరితోట మహత్యమేనని ఆమెకి తెలుసు. అందుకే తనంతటిదానికి వాళ్ళు అమర్యాద చెయ్యటాన్ని ఆమె భరించలేక పోతోంది. ఆ కోపంలోనే ఆకులో ఉన్న బీరకాయ కూర తీసి నేలమీద పడేసింది. నా తర్వాత కొబ్బరి పచ్చడికీ అదే గతి పట్టింది.

"పెరుగు పొయ్యండి" తన కోపాన్నంతా విస్తట్లో ఉన్న అన్నం మీద చూపించి, అన్నాన్ని చేత్తో కసాపిసా పిసుకుతూ అసహనంగా అంది. సందేహిస్తూనే మజ్జిగ పోసింది కేశవ రావు భార్య.

"పెరుగు పోయ్యమంటే మజ్జిగ పోశారేమిటి?" కుసుమ విసుక్కుంది.

"మీరిలా వస్తారని ముందుగా తెలియక పోవడం వల్ల ఏ ఏర్పాట్లూ చెయ్యలేకపోయాం. ఈ పూటకి దీంతో సర్దుకోండి. సాయంత్రం అన్నీ మీకిష్టమైనవే చేయిస్తాను" మధ్యలో కల్పించుకుంటూ అన్నాడు కేశవరావు. అతను అంతలా అర్థించేసరికి కాదనలేకపోయింది కుసుమ. "సరే భోజనం అయ్యాక నేను పొలం చూడ్డానికి వెళతాను. తిరిగొచ్చేసరికి ఏ అర్ధరాత్రో అవుతుంది. అప్పటికి వేడివేడి అన్నం, చారు, కాసిని వేపుడు ముక్కలు, కాస్త గడ్డపెరుగు సిద్ధంచేసి ఉంచమని చెప్పు మీ ఆవిడకి." చెప్పేసి ఏవో రెండు మెతుకులు తిందనిపించి, విస్తరి ముందు నుంచి లేచిపోయింది.

చెయ్యి కడుక్కోవడానికి వెళుతున్నదల్లా ఎందుకో అనుమానం వచ్చి ఆగి భుజాల మీంచి వెనక్కి చూసింది. తన వెనక నిలుచున్న కేశవరావు భార్య ముఖంలో కోపం, అవమానం అన్నీ కలగాపులగంగా కనిపించాయి.

"ప్చ్! ఇంతకు మించి రియాక్షన్ కనపడదు వీళ్ళలో. పూటకి గతిలేనివాళ్ళు, పొలం పుట్రా లేని మనుషులూ తమ కోపాన్ని అదుపులోనే ఉంచుకోవాలి మరి!" అనుకుంటూ ముందుకి కదిలింది.

ఉదయం నుంచీ ఇసుకలో ఎడారిలా ఉండే పండ్ల తోటలన్నీ తిరగడం వల్ల కాళ్ళు నొప్పులు పుడుతున్నా విశ్రాంతి అనే పదాన్ని పక్కకి నెట్టి, వెంటనే చూడాల్సిన మిగతా పొలాలవైపు బయలుదేరింది కుసుమ.

తిరిగి తిరిగి అర్ధరాత్రి ఇంటికి చేరింది కుసుమ. ఆమె వెళ్ళేసరికి తనకోసమే ఎదురుచూస్తూ కనిపించారు కేశవరావు. అతని భార్య, వాళ్ళతోపాటే అక్కడ మరో వ్యక్తి కూడా ఉన్నాడు. అతన్ని అక్కడ చూసేసరికి ఆమె కళ్ళు విశాలమయ్యాయి.

(మిగతా వచ్చే వారం)

# ఆగండి

## చదివి - ఆలోచించండి!

※ గోల్ఫ్ గేముకి ఆ పేరెలా వచ్చిందీ (కొన్ని సంవత్సరాల క్రితం స్కాట్‌లాండ్‌లో ఈ గేమ్ కనిపెట్టినప్పుడు ఒక నియమం పెట్టారట. ఏమంటే ఈ గేమ్ ఆడటానికి 'జెంటిల్‌మన్ ఓన్లీ... లేడీస్ ఫర్‌బిడెన్' అని. ఈ వాక్యాలలోని మొదటి అక్షరాలు కలిపితే గోల్ఫ్ అనే మాట వచ్చింది. (GOLF)

※ అందరూ తాగే కోకాకోలా ప్రథమంలో ఆకుపచ్చ రంగులో ఉండేదట తెలుసా?

※ తెలివిగల వ్యక్తుల జుట్టులో ఎక్కువ జింక్, రాగి ఉంటాయట.

※ అదేపనిగా టీ.వీ. సీరియల్స్ చూసే మహిళల జుత్తులో ఎక్కువగా బంక, చుండ్రు వుండి వుంటాయేమోనని ఒక ప్రముఖ రీసెర్చి సంస్థ, పరిశోధన ప్రారంభించిందట!

※ టైప్‌రైటర్ ఉపయోగించి రచించిన ప్రథమ ఇంగ్లీష్ నవల? టామ్ సాయర్.

※ అసలు చెడిపోని తిండి పదార్థం: తేనె

※ అంకెలు ఒకటి నుంచి ఇంగ్లీష్‌లో చెప్పకుంటూ పోతే, ఎన్ని అంకెల తర్వాత ఇంగ్లీష్ అక్షరం ఎ వస్తుంది? ఒక వెయ్యి.

※ లేజర్ ప్రింటర్, విన్డ్ షీల్డ్ వైపర్, బులెట్ ప్రూఫ్ వెస్ట్, వీటన్నిటికీ వెనక వున్నదెవరు? ఇవన్నీ మహిళలు కనిపెట్టినవే.

※ ప్రపంచంలో ఎక్కడ అందరికన్నా ఎక్కువ శాతం ప్రజలు వాళ్ళ పనులకి నడిచి వెళ్తారు? అమెరికాలోని అలాస్కాలో.

※ అమెరికాలో మొనోపలీ గేము ఎంత ప్రసిద్ధి అంటే దానిలో వాడే పేపర్ కరెన్సీ నోట్లు, అమెరికా మొత్తంలో గవర్నమెంటువారు ప్రింట్ చేసే డాలర్ నోట్లకన్నా ఎక్కువగా వేస్తారుట.

※ చివరిగా మన మోచేతిని మన నాలుకతో నాకటం అసంభవం. ప్రయత్నించండి!

– వి.కె. మోహన్